క్లుప్తంగా

విత్తనాలు పంపిణీ



విత్తనాలను పంపిణీ చేస్తున్న సభ్యులు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్‌లో శ్రీవేంకటేశ్వర సేవా సమితి సభ్యులు ఆదివారం రసాయనాలు లేని కూరగాయల విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. అనంతరం ఆరోగ్యకర సమాజంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటిల్లిపాది ఆరోగ్యం కోసం రసాయనాలు లేని ఆహార పంటలు పండించి తినాలని కోరారు. ప్రకృతికి అనుకూలంగా జీవిస్తేనే ఆరోగ్యకర సమాజం ఏర్పడుతుందన్నారు. గ్రామాల్లో రసాయనాలు లేని వ్యవసాయంపై అవగాహన పెరగాలని, కల్తీ లేని ఆహార పంటల వినియోగం పెరగాలని సూచించారు. సమావేశంలో సమితి సభ్యులు, మహిళా రైతులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు ప్రారంభించాలి



గన్నేరువరం: గుండ్లపల్లి నుంచి గునుకులకొండాపూర్ మీదుగా గన్నేరువరం వరకు రోడ్డు మరమ్మతు పనులను వెంటనే ప్రారంభించాలని టీటీడీపీ మండల అధ్యక్షుడు గుండా పర్శరాంగౌడ్ కోరారు. గుండ్లపల్లిలో ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. అధ్వానంగా మారి, దుమ్ముధూళితో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తారు రోడ్డు తొలగించి, మట్టి పోశారని, ఆరునెలల కావస్తున్నా అతీగతి లేదని విమర్శించారు. ప్రజల అవసరాల దృష్ట్యా అధికారులు తారురోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.

వైఎస్సార్‌టీపీ నాయకుల పరామర్శ



పరామర్శిస్తున్న శ్రీనివాస్‌గౌడ్

గన్నేరువరం: బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ కన్వీనర్, మండలంలోని మైలారం గ్రామానికి చెందిన ముత్యాల జగన్‌రెడ్డి తండ్రి నర్సింహరెడ్డి ఇటీవల మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం వైఎస్సార్‌టీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు జాగిరి శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు సాయితేజగౌడ్, మహేందర్‌గౌడ్, సురేశ్, వెంకటేశం పాల్గొన్నారు.

రామడుగులో...

రామడుగు: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు గోనెపల్లి లచ్చయ్య తల్లి ఎల్లవ్వ అనారోగ్యంతో మృతి చెందగ ఆదివారం పార్టీ రాష్ట్ర నాయకుడు రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, నాయకులు పంజాల జగన్‌మోహన్‌గౌడ్, ఎండీ మోయిస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన లయన్స్ క్లబ్ సభ్యులు



ఆహ్వాన పత్రిక అందజేస్తున్న లయన్స్ సభ్యులు

గన్నేరువరం: మండల కేంద్రంలో నిర్మించిన లయన్స్ క్లబ్ భవనాన్ని 9న ప్రారంభించనున్నామని క్లబ్ చైర్మన్ బొడ్డు సునీల్ తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌ను ఎల్‌ఎండీలోని క్యాంపు కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో భవన ట్రస్ట్ చైర్మన్ గంప వెంకన్న, గొల్లపల్లి రవి, బూర శ్రీనివాస్, కాంతాల కొండల్‌రెడ్డి, బూర రామకృష్ణ, మధుకర్ పాల్గొన్నారు.

గోపాల్‌రావుపేటలో బడిబాట



ఇంటింటి ప్రచారంలో ఉపాధ్యాయులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో ఆదివారం ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, ఉత్తమ విద్యా బోధన తీరును వివరిస్తూ ప్రచారం చేశారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి వేణుకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచరు.. పూర్తి చేయరు

- 'డబుల్' ఇళ్లు నిర్మించినవి పదుల్లో అప్లికేషన్లు వందల్లో
- ఏళ్లుగా ఎదురుచూపు
- సొంతింటి కల నెరవేరేనా..?



బూజునూర్‌లో పంపిణీకి సిద్ధంగా డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లు



చిన్నకోమటిపల్లిలో అసంపూర్తిగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు

ఇల్లందకుంట: డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణాల తీరు చూస్తే పేదవాళ్ల సొంతింటి కల కలగానే మిగిలిపోయేలా ఉంది. ప్రభుత్వం 2017లో మండలంలోని చిన్నకోమటిపల్లి గ్రామంలో 48, బూజునూర్ గ్రామంలో 52 డబుల్ ఇళ్ల నిర్మాణం ప్రారంభించింది. చిన్నకోమటిపల్లిలో నిధుల లేమితో ఇళ్ల పనులు నిలిచిపోయాయి. నాలుగేళ్లు అవుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. సరిపడా నిధులు ప్రభుత్వం కేటాయించి ఇళ్ల నిర్మాణ పనులు తిరిగి చేపట్టి పేదోడి సొంతింటి కల నెరవేర్చాలని గ్రామస్తులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

సమన్వయలోపం

చిన్నకోమటిపల్లిలో 48 ఇళ్ల కోసం 250మంది దరఖాస్తు చేసుకున్నారు. బూజునూర్ గ్రామంలో కరెంట్, మురుగుకాలువల నిర్మాణం మినహా దాదాపు 52 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. వీటి కోసం 175 మంది దరఖాస్తు చేసుకున్నారు. నిర్మించిన ఇళ్లు తక్కువ దరఖాస్తులు చేసుకున్న లబ్ధిదారులు ఎక్కువగా ఉండటంతో అధికారులు అసలైన వారిని ఎంపిక చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. గతంలో అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి దారిద్ర్యరేఖకు దిగువన ఉండే తెల్లరేషన్‌కార్డు కలిగి అద్దె ఇంట్లో నివసిస్తున్న వారిని గుర్తించామన్నారు. కానీ అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయం లోపంతో గతేడాది సంక్రాంతికి గృహప్రవేశం చేద్దామనుకున్నా లబ్ధిదారులకు నిరాశే ఎదురైంది. ఏది ఏమైనా పంపిణీకి సిద్ధంగా ఉన్న ఇళ్లను అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కేటాయిస్తారనే ఆశతో లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. వారి కళ్లలో సంతోషం నిండేది ఏనాడో వేచి చూడాలి.

నిధులు కేటాయించాలి



నాలుగేళ్లుగా ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి. గ్రామానికి దూరంగా గుట్టల పక్కన నిర్మిస్తుండటంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డగా మారింది. పోలీసులు దృష్టిసారించాలి.

– మూడెడ్ల మహేందర్, కాంగ్రెస్ నాయకుడు, చిన్నకోమటిపల్లి

నివేదిక పంపుతాం



బూజునూరు గ్రామంలో ఇళ్ల నిర్మాణం పూర్తయింది. లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామంలో సర్వే చేశాం. ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను గ్రామ సభ ద్వారా ఫైనల్ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతాం.

– మాధవితాకూర్, తహసీల్దార్, ఇల్లందకుంట

రైతులకు క్షమాపణ చెప్పాలి

హుజూరాబాద్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి రైతుల పట్ల చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, రైతులకు కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డీసీసీ జిల్లా అధికార ప్రతినిధి సొల్లు బాబు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కొల్లూరి కిరణ్‌లు డిమాండ్ చేశారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జమ్మికుంట మండలంలో రైతు దినోత్సవం కార్యక్రమంలో ఓ రైతు ఇచ్చిన హామీ అమలు చేశారా అని ప్రశ్నించినందుకు అనుచిత వ్యాఖ్యలు చేశారని మాటలను వెనక్కి తీసుకోవాలన్నారు. పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు పుష్పలత, మైనార్టీ సెల్ అధ్యక్షుడు అప్సర్, సీనియర్ నాయకులు రవి, రమేష్, సంపత్ కుమార్, విజేందర్, ఐలయ్య, ఎండీ చాంద్ ,రాజ్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: రుణమాఫీ, అకాల వర్షాలకు పంట నష్ట పరిహారం ఎక్కడని ప్రశ్నించిన రైతుపై అనుచిత వాఖ్యలు చేసిన కౌశిక్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మొలుగూరి సదయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని స్వగృహంలో మాట్లాడారు. మాటలను బేషరతుగా ఉపసంహరించుకోవాలని లేదంటే కౌశిక్‌రెడ్డికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సలీం పాషా, పట్టణ మాజీ అధ్యక్షుడు వెంకన్న, నాయకులు సతీశ్‌రెడ్డి, రాజేశ్వర్‌రావు, రవీందర్, నాగేందర్,శ్రీనివాస్, సురేష్, రవి, అశోక్, మహేందర్, రాజమౌళి, సంపత్‌తోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: రైతును అవమానించిన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ నాయకుడు వంగ రామకృష్ణ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రైతువేదిక వద్ద మాట్లాడారు. నాయకులు గూడెపు ఓదెలు, మంకు ఐలయ్య, ఆరెల్లి రమేశ్‌గౌడ్, వీరారెడ్డి, గుండారపు సాయికుమార్, పెద్ది అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



కల్వర్టు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రసమయి

తిమ్మాపూర్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని పోరండ్ల గ్రామంలో ఎమ్మెల్యే ఆదివారం పర్యటించారు. గ్రామంలో రేషన్ కార్డుల సంఖ్య పెరగడంతో తాత్కాలికంగా మంజూరైన రెండో రేషన్‌షాప్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి కల్యాణలక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యేను ప్రజాప్రతినిధులను ఘనంగా సన్మానించారు.

కల్వర్టు పనులు పరిశీలన..

అంతకుముందు తిమ్మాపూర్ పోరండ్ల గ్రామాల మధ్యలో నిర్మిస్తున్న కల్వర్టు నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించాలని, వర్షాకాలం సమీపిస్తున్నందున పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రావుల రమేష్, రాష్ట్ర నాయకులు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి, ఉల్లెంగుల ఏకానందం, సర్పంచ్ రెడ్డి త్రివేణి తిరుపతి రెడ్డి, ఉప సర్పంచ్ సతీష్, గ్రామ శాఖ అధ్యక్షుడు శ్రీనివాస్,రేషన్ డీలర్ వనజ, నాయకులు శ్రీనివాస్, కొమురయ్య ,తిరుపతి, తహసీల్దార్ కనుకయ్య, ఆర్‌ఐ అక్బర్, వీఆర్‌ఏ కొమురయ్య పాల్గొన్నారు.

10న సుపరిపాలన దినోత్సవం

గన్నేరువరం: మండల కేంద్రంలో 10న సుపరిపాలన దినోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. ఆదివారం అధికారులు, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో గన్నేరువరంలో సమావేశం నిర్వహించి సభా స్థలిని పరిశీలించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్ హాజరవుతారని తెలిపారు. జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కోఆర్డినేటరు గూడెల్లి తిరుపతి, ఎంపీడీవో స్వాతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రం అందుకుంటున్న తిమ్మాపూర్ ఎస్సై ప్రమోద్‌రెడ్డి



రామడుగు: సిబ్బందిని అభినందిస్తున్న చొప్పదండి సీఐ రవీందర్

పోలీసులకు ప్రశంసా పత్రాలు



ప్రశంసా పత్రం అందుకుంటున్న జబ్బర్‌లాల్

తిమ్మాపూర్: రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్‌లోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఆదివారం సురక్ష దినోత్సవం నిర్వహించారు. వేడుకల్లో భాగంగా ర్యాలీ తీశారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబర్చిన పోలీసులకు మంత్రి గంగుల కమలాకర్, సీపీ సుబ్బారాయుడు ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. ఎల్‌ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డితోపాటు ఏఎస్సై నజీముద్దీన్, హెడ్ కానిస్టేబుళ్లు లింగారెడ్డి, శంకర్, ఆంజనేయులు, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, రాజ్ కుమార్, హెచ్‌జీ లక్ష్మినారాయణ ప్రశంసా పత్రాలు అందుకున్నారు. జిల్లాలో ఒక పోలీస్ స్టేషన్ నుంచి ఇంత మందికి ఉత్తమ పురసాకరాలు రావడం గర్వంగా ఉందని ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపారు. విధి నిర్వహణలో ఎల్‌ఎండీ పోలీసుల ప్రతిభను సీపీ సుబ్బారాయుడు అభినందించారు.

ఇల్లందకుంట: ఇల్లందకుంట ఎస్సై తోట తిరుపతి ఉత్తమ ఎస్సైగా ప్రశంసాపత్రం అందుకున్నారు. ఎస్సైని మంత్రి, సీపీ, ఏసీపీ కోట్ల వెంకట్‌రెడ్డి, సీఐ సురేశ్ అభినందించారు.

రామడుగు: మండలంలో లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన కానిస్టేబుల్ మల్లేశ్ ప్రశంసాపత్రం అందుకున్నారు. మల్లేశ్‌ను గ్రామస్తులు అభినందించారు. రామడుగు పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఏఎస్సైగౌస్‌ఖాన్, హెడ్ కానిస్టేబుల్ రవీందర్, కానిస్టేబుల్ రాములు, హోంగార్డు ప్రభాకర్ ప్రశంసపత్రాలు అందుకున్నారు. అనంతరం వీరిని చొప్పదండి సీఐ రవీందర్, రామడుగు ఎస్సై అంజయ్య అభినందించారు.

చొప్పదండి: చొప్పదండి పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ జబ్బర్‌లాల్ ప్రశంసాపత్రం అందుకున్నారు.హోంగార్డ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న సతీశ్‌కు ప్రశాంసా పత్రం అందించారు. వీరిని సీఐ రవీందర్, ఎస్సై ఉపేంద్రచారి అభినందించారు.



ఇల్లందకుంట: ప్రశంసాపత్రం అందుకుంటున్న ఎస్సై తోట తిరుపతి



రామడుగు: ప్రశంసా పత్రం అందుకుంటున్న మల్లేశ్

ఆధ్యాత్మికం

ఏరువాక పౌర్ణమి వేడుకలు

చొప్పదండి: మండలంలోని రుక్మాపూర్ వేంకటేశ్వర ఆలయంలో ఆదివారం ఏరువాక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మట్టికుండలో వండిన స్వదేశీ బియ్యం, మిల్లెట్ వంటకాలు, ఎద్దుగానుగ నూనె, దేశీ ఆవుపాలు, పెరుగు, నెయ్యి, రాక్ సాల్ట్ వంటి సాంప్రదాయ ఆహార పదార్థాలతో వంటకాలు తయారు చేసి గ్రామస్తులకు వడ్డించారు. కుండ భోజనం, మోతుకు విస్తార్లు, రసాయనాలు లేని ఆహార పదార్థాలతో ప్రతి పౌర్ణమికి గ్రామస్తులు, రైతులకు అన్నదానం నిర్వహిస్తున్నామని శ్రీవేంకటేశ్వర సేవా సమితి సభ్యులు తెలిపారు.



చొప్పదండి: గ్రామస్తులకు భోజనం వడ్డిస్తున్న శ్రీవేంకటేశ్వర సేవా సమితి సభ్యులు

శ్రీరేణుకా ఎల్లమ్మను దర్శించుకున్న రసమయి

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామంలో శ్రీరేణుక ఎల్లమ్మ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం వాసు, సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాడుగుల రవీందర్‌రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా కోఆర్డినేటర్ గూడెల్లి తిరుపతి, కార్పొరేటర్ తోట రాములు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంపప వెంకన్న, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, నాయకులు తోట కోటేశ్వర్, న్యాత సుధాకర్, ప్రభాకర్, సాయి, గ్రామస్తులు పాల్గొన్నారు.

రంగానాయకస్వామి కల్యాణోత్సవాల్లో..

మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో శ్రీరంగనాయకస్వామి కల్యాణోత్సాల్లో ఆదివారం డీసీసీ అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు కవ్వంపల్లిని శాలువాతో సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కవ్వంపల్లిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నూతన కమిటీ



కొత్తగట్టు ముదిరాజ్ సంఘం నూతన కమిటీ

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు ముదిరాజ్ సంఘం నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎడ్ల తిరుపతి, గౌరవ అధ్యక్షుడిగా పప్పు ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా పప్పు రాజు, కార్యదర్శిగా పిట్టల సమ్మయ్య, కోశాధికారిగా నీలం నాగయ్య, ప్రచారకార్యదర్శిగా ఎడ్ల సంపత్, డైరెక్టర్లుగా రెడ్డి శంకర్, పోలు శరత్, పోలు సమ్మయ్య, పిట్టల తిరుపతి ఎన్నికయ్యారు.

పచ్చదనం పరిచినట్టు



పక్క చిత్రంలో భూమిపై గ్రీన్ కార్పెట్‌పరిచినట్టుందని అనుకుంటే పొరబడినట్టే. మండలంలోని కొండపల్కల గ్రామ శివారులో ఓ రకానికి చెందిన గడ్డితీగ మురుగుకాలువను కమ్మేసింది. దీంతో రోడ్డు వెంబడి వెళ్లేవారి దృష్టిని ఆకట్టుకుంటోంది.

- మానకొండూర్

- హామీల అమలేది

జమ్మికుంట: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయకుండా, సురక్ష దివస్ ఎలా నిర్వహించారని హుజూరాబాద్ నియోజకవర్గ బీఎస్పీ అధ్యక్షుడు సదానందం విమర్శించారు. ఆదివారం పట్టణంలో మాట్లాడారు. హోంగార్డులకు ఉద్యోగ భద్రత, ఆరోగ్యబీమా, కారుణ్యనియామకాల్లో ప్రాధాన్యం ఇవ్వడం లేదన్నారు.